# అసలు సంగతి

## గొట్టేటి లలితా శేఖర్

''ఇలాంటి వెధవల్ని ఏం చేసినా పాపంలేదు. నడిబజార్లో ఉరెయ్యాలి. కాలో, కన్నో తీసెయ్యాలి'' ఇలా సాగుతోంది ముందు గదిలోంచి. నడవాలో క్షురకర్మ చేసుకుంటున్న నాకు అర్థమయిందేమంటే న్యూస్‌పేపరు వచ్చిందన్నమాట. పేపరు చూస్తే మా సుచిత్రకు పూనకం వచ్చేస్తుంది. ఆవేశం ఏసాయంకాలానికో గాని చల్లారదు.

నా శ్రీమతి సుచిత్రకు అన్నీ కాస్త ఎక్కువే అని చెప్పాలి. అందం ఎక్కువే. అతిశయం కూడా ఎక్కువే. ప్రేమ ఎక్కువే పైపెచ్చు మా ఆవిడ ఫెమినిస్టు. నేను హ్యూమనిస్టు. మా నాన్న కమ్యూనిస్టు, మా అబ్బాయి క్రికెటిష్టు. ఇలా ఇష్టారాజ్యంగావున్న మా ఇంట్లో ఏదో ఒక విషయం మీద ఇష్టాగోష్టి నిర్వహిస్తుంటాం. వెరసి నేను మా ఆవిడిష్టుణ్ణి కావడంచేత ఆవిడ ఇష్టానికి ఎదురుచెప్పి కష్టం తెచ్చుకునే సాహసం నేనెపుడూ చేయలేదు. సుచిత్రకు అన్నీ ఎక్కువైనట్టే మంచితనం కూడా ఎక్కువే.

''నీచులు నికృష్టులు జాత్యహంకారం'' ఇలా సాగుతూనే వుంది సుచిత్ర గొంతు.

''సుచీ కాస్త కాఫీ తెస్తావా? వీలైనంత అనునయంగానే అడిగాను. క్షురకర్మ ముగించి పేపరు చేతిలోకి తీసుకోగానే కాఫీ కప్పుతో వచ్చింది సుచిత్ర.

సుచిత్రకింత ఆవేశం కలిగించిన న్యూస్ ఐటమ్ ఏమిటో చూశాను. 'మూడునెలల పసికందుతో సహా భార్యను సజీవదహనం చేసిన పతిదేవుడు' వివరాలు చదివేసరికి సుచిత్రకొచ్చిన ఆవేశంలో సగం నాక్కూడా వచ్చిన మాట నిజం. కప్పు అందుకుని ఒక్కగుక్కలో మింగాను. మూతి కాలింది. బాగా మరగబెట్టినట్టుంది. ''ఇలా ఆవేశపడి ఏం ప్రయోజనం సుచీ?'' భయంగా అడిగాను.

''అవును మీరన్నది నిజమే. ఇలా వూర్కే ఆవేశం తెచ్చుకునీ ప్రయోజనం లేదు. ఇలాంటి వెధవల్ని ప్రత్యక్షంగానే ఎదుర్కోవాలి'' అంది సుచిత్ర సీరియస్‌గా.

నా గుండె దడదడలాడింది. ఇరుగు పొరుగు మగజీవాలన్నీ కళ్ళముందు మెదిలాయి. ప్రక్కింటి సోమేశంగారు కాస్త బక్కపలుచగా వుంటాడు. భార్యకనారోగ్యం కావడంచేత ఇంటి పనుల్లో మూడువంతులు ఆమానవుడే నిర్వహిస్తాడు. పైగా సుచిత్రను ''అమ్మాయీ!'' అంటూ ఎంతో ఆప్యాయంగా పిలుస్తాడు.

ఇక పొరుగింటి రామలింగం కూడా ఫెమినిస్టే అని వాళ్ళావిడ సుచిత్రకు చెప్పిందట. ఇక మిగిలింది మా ఇంటి ఎదురుగా నెలక్రితం కొత్తగా వచ్చి చేరిన సుబ్బారావు.

> ''ఏం బాగావుండటం? సాటి స్త్రీ చిత్రహింసలు పడుతూంటే చూస్తుండమంటారా? అయినా కాస్త సోషియల్ ఎవేర్‌నేస్ వుండాలి. మీకు భయంగా వుంటే మీరింట్లోనే వుండండి. నేను వెళ్ళి విషయం తెలుసుకొస్తాను'' అంది ఆవేశంగా సుచిత్ర.

సుబ్బారావు పొట్టిగా గుండ్రంగా లావుగా ఫుట్‌బాల్‌లా వుంటాడు. వాళ్ళావిడ కూడా లావుగా, గుండ్రంగా, పొట్టిగా త్రోబాల్‌లా వుంటుంది. వాళ్ళ ఏకైక పుత్రరత్నం కార్క్‌బాల్‌లా చిన్నగా గుండ్రంగా ధృడంగా వుంటాడు. వాళ్ళ ఇల్లు ఓ ప్లేగ్రౌండులా ముచ్చటగా వుంటుంది. ఇంతే వివరాలు నాకు సుబ్బారావు గురించి తెలుసును. నేనాఫీసుకెడుతూంటే సుబ్బారావు ఎదురుపడుతూంటాడు. కానీ పరిచయ ప్రమేయాలు పెట్టుకునేట్టుండడు. ముఖం ఎటోతిప్పుకుని పోతూంటాడు.

మా సుచిత్రక్కూడా సుబ్బారావు భార్యతో పరిచయభాగ్యం కలిగినట్టులేదు. ఆవిడేదో ప్రభుత్వోద్యోగం చేస్తున్నట్టుగాను, ఉదయం పరిగెడితే ఏ సాయంత్రానికో ఇంటికి చేరుతుందని కామన్ పనిమనిషి రత్తమ్మ చెప్పింది.

• • •

ఓ ప్లెజంటయిన ఆదివారం మా బాబిగాడు ఎదురింటి కార్క్‌బాల్‌తో ఆడుకుంటున్నాడు. మానాన్న ఏదో మీటింగుకు వెళ్ళాడు. సుచిత్ర పని ముగించుకుని అందంగా ముస్తాబై ప్రశాంత వదనంతో, సుఖాసీనురాలైవుంది. మాట్లాడకపోతే సుచిత్ర మరింత అందంగా వుంటుంది.

ఇంతలో మా ఆనందాన్ని భగ్నంచేస్తూ, సుబ్బారావింట్లోంచి ''హా హా''కారాలూ, అరుపులూ, కేకలూ వినవొచ్చాయి. నేపథ్యంగా టి.వి. సంగీతం.

ఇద్దరం కంగారుగా లేచి నిలబడ్డాము. ఓ నిముషం విన్నమీదట నిస్సందేహంగా అది భార్యభర్తల తగువే అని తేల్చుకున్నాము.

ఇంతలో తలుపు తెరుచుకుని వేగంగా సుబ్బారావు బయటకొచ్చాడు. కళ్ళు ఎర్రబడ్డాయి. జుట్టు చెదిరింది. చొక్కా నలిగింది. స్కూటరు స్టార్ట్‌చేసి వేగంగా పోనిచ్చాడు.

ఇదంతా గమనిస్తున్న సుచిత్ర ముఖం ఎర్రగా దానిమ్మపూవులా మారిపోయింది.

''అయితే రత్తమ్మ చెప్పింది నిజమేనన్నమాట'' అంది స్వగతంగా.

''ఏం చెప్పింది?'' అడిగాను.

''వారంలో రెండుసార్లయినా గాజుసామాన్లు పగులుతాయట. ఇల్లంతా నానా భీభత్సంగానూ వుంటుందిట. ఆరోజు ఆవిడ మంచం మీంచి లేవదటపాపం'' అంది సానుభూతిగా సుచిత్ర.

''అయినా సుచీ! మనుష్యులన్నాక రకరకాలుగా వుంటారు. అందరినీ ఉద్ధరించడం మనవల్లవుతుందా చెప్పు? మనకెందుకొచ్చిన గొడవ'' అన్నాను జ్ఞానబోధ చేస్తూ.

కానీ సుచిత్ర నామాటలు విన్నట్టులేదు.

''ఆవిడ బాగా చదువుకుందట. ఉద్యోగం హోదా కూడా పెద్దవేనట. ఆ కాంప్లెక్స్‌తో ఇలా కొట్టి హింసిస్తున్నాడల్లేవుంది'' అంది సీరియస్‌గా ముఖంపెట్టి.

''నీకెలా తెలుసు?'' అడిగాను.

''ఇలాంటివి దాగుతాయా? శారదగారు చెప్పింది లెండి. అయినా చూస్తాను. ఆ నరకం ఆవిడెలా భరిస్తోందో? పాపం. ఏమైనా నాచేతిలో వాడికి చెప్పుదెబ్బలు ఖాయం'' సుచిత్రలో ఆవేశం స్థాయి పెరుగు

తోంది.

''సుచీ! నామాట విను మొగుడూ పెళ్ళాల విషయాల్లో తలదూర్చకూడదు. చివరకు వాళ్ళు బాగానే వుంటారు. మధ్యలో మనం రొష్టుపడటం దేనికి చెప్పు?'' బ్రతిమాలాను.

''ఏం బాగావుండటం? సాటి స్త్రీ చిత్రహింసలు పడుతూంటే చూస్తుండమంటారా? అయినా కాస్త సోషియల్ ఎవేర్‌నెస్ వుండాలి. మీకు భయంగా వుంటే మీరింట్లోనే వుండండి. నేను వెళ్ళి విషయం తెలుసుకొస్తాను'' అంది ఆవేశంగా సుచిత్ర.

''సుచిత్రా! నేనంటే ప్రేముందా లేదా నీకు?'' అడిగాను ఆఖరి అస్త్రాన్ని ప్రయోగిస్తూ.

ఉపార్మి పూర్కే. ఇంకోసారి ఆపూల్ ఇలాగే ప్రవర్తిస్తే, మర్నేంటి సాటి మనిషిగా నేనే కలుగజేసుకుని న్యాయం జరిపిస్తాను.'' అన్నాను లేని ఆవేశాన్ని తెచ్చుకుని.

సుచిత్ర నా స్వాంతన వచనాలకు కాస్త మెమ్మోదించినా ముఖంలో చిటపటలు పోలేదు. గండం గడిచినందుకు దేవుడికి దణ్ణంపెట్టి సుబ్బారావును తిట్టుకున్నాను. ఇంటి ఎదురుగా తగలడి మనఃస్తాపం కలుగజేస్తున్నందుకు.

• • •

వారంరోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. సుచిత్ర వాళ్ళమ్మని చూస్తానని నాలుగు రోజులు కాకినాడ వెళ్ళింది.

ఆరోజు ఉదయాన్నే పనిమనిషి రత్తమ్మ పరిగెత్తుకొచ్చింది.

''అయ్యగారూ! లోపల పెద్దగొడవైపోతావుందండి తలుపులేసేసున్నాయి'' అంది కంగారుగా సుబ్బారావు ఇంటికేసి చూస్తూ. వరండాపై నిలబడి ఎదురింటి పరిస్థితిని అంచనా వేస్తున్నాను. ఎప్పటిలాగే అరుపులు, కేకలు, టి.వి. సంగీతంతో మిళితమై. ప్రక్కవాళ్ళకు తెలియకూడదని కాబోలు సౌండ్ పెంచేస్తున్నాడు రాస్కెల్. సమయానికి సుచిత్ర ఇంట్లో లేకపోవడం నా అదృష్టంగా భావించి రత్తమ్మను పని చూస్కోమని కసిరాను.

మరునాడే సుచిత్ర వచ్చేసింది. సుబ్బారావూ, పెళ్ళాం అన్యోన్యంగా కాపరం చెయ్యాలని వెయ్యి దేవుళ్ళకు దణ్ణం పెడుతున్నాను.

నేను భయపడ్డ ఘడియ రానేవచ్చేసింది. ఆఫీసు పనెక్కువగావుండి కాస్త ప్రొద్దుపోయాక ఇంటికొచ్చాను. స్నానం కానిచ్చి వచ్చేసరికి సుచిత్ర వీధి గుమ్మంలో నిలబడి ఎదురింటిని అవలోకిస్తోంది.

ఎప్పటిలాగే సుబ్బారావింట్లోంచి 'హాహా'కారాలు, అరుపులు మిన్నుముట్టాయి.

సుచిత్ర వేగంగా సుబ్బారావింట్లోకి వెడుతోంది.

అయ్యబాబోయ్! అనుకున్నంత అయింది. గుట్టుగా సాగిపోతున్న నా సంసారం వీధిలోకొచ్చేసింది.

''సుచిత్రా! ఆగు నామాట విను వాడడ్డమైన తిట్లు తిడతాడు.'' అంటూ నేను సుచిత్ర వెనుకే పరుగెత్తాను.

సుచిత్ర ఆవేశంగా మూసివున్న తలుపులు తోసింది. ప్రయోజనం లేదు. లోపలేం చేస్తున్నాడోవాడు. కిరోసిన్ పోసి అగ్గిపెట్టకోసం వెతుకుతున్నాడో, లేక ఆమెను వంటింట్లోకి తోసి గేస్ రిలీజ్ చేస్తున్నాడో! లోపలినుంచి చావుకేకలు వినవొస్తున్నాయి.

సుచిత్ర ఇంటి చుట్టూతా పరుగెడుతోంది, నిస్సహాయంగానే, యధాశక్తి సుచిత్ర పరుగునందుకోవాలని నా ప్రయత్నం. సుచిత్ర మళ్ళీ వీధిలో ఆగి హాలు కిటికీ తలుపు బలంగా తోసి లోపలికి చూస్తోంది. నేనూ లోపలి దృశ్యాన్ని చూశాను. ఆశ్చర్యం!

సుబ్బారావు గోడకతుక్కుపోయి మొహానికి చేతు లడ్డం పెట్టుకుంటూనే ఏవేవో తిడుతున్నాడు. ఆవిడా అంతకు మించిపోయి తిడుతూ అందిన వస్తువులన్నింటినీ విసిరేస్తోంది. టీవీ మోతలో వాళ్ళిద్దరి గొంతులూ కలిసిపోయి బైటకి మాకు మచ్చుకి వినిపించే గోలకి స్టీరియోఫోనిక్ ఎఫెక్ట్ వస్తోంది. వెనక్కి తిరిగి మా ఇంట్లోకెళ్ళబోతూ నేనూ సుచిత్రా ఒకరి ముఖాలొకరం చూసి ఫక్కున నవ్వుకున్నాం.

★

